

జంగాలమెట్టలో భూప్రకంపనలు

ప్రజాశక్తి -.జి.మాడుగుల : జి.మాడుగుల మండలంలో జంగాలమెట్ట పరిసరప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున 4:19 గంటల సమయంలో స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై 3.7గా భూకంప తీవ్రత నమోదైంది. అందరూ గాఢ నిద్రలోఉండగా కొన్ని సెకెన్లపాటు భూకంపం సంభవించడంతో అనేక మందికి తెలియకపోయినా, అదే సమయంలో మెలకువ వచ్చిన కొందరు భూమి కదలికతో భీతిల్లిపోయారు. గ్రామంలో గుంట పూర్ణమ్మ అనే గిరిజన మహిళకు చెందిన ఇళ్లు భూకంప ప్రభావంతో కూలిపోయింది, ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకపోవడంతో గిరిజనులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



భూకంప తీవ్రతకు కూలిన ఇల్లు

కాలినడకన ఆరు కిలోమీటర్లు..

- ఆసుపత్రికి వెళ్లేందుకు శిశువుతో బాలింత అగచాట్లు



బాలింత, శిశువును ఆసుపత్రికి తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి :ప్రసవానంతరం తలెత్తిన ఆరోగ్య సమస్యలతో బాలింత, అపుడే పుట్టిన నవజాత శిశువును ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా కాలినడకన ఆసుపత్రికి తరలించిన దయనీయ ఘటన మంగళవారం మారుమూల పినకోట పంచాయతీ పందిరిమామిడివలస గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. గ్రామానికి చెందిన గెమ్మెలశాంతి మంగళవారం శిశువుకు జన్మనిచ్చింది. అయితే తల్లీబిడ్డను వైద్యులకు చూపించేందుకు కుటుంబసభ్యులు నానా అవస్థలు పడ్డారు.

శిశువు తోపాటు బాలింతను కొండలు దట్టమైన అటవీ ప్రాంతంలో సుమారు 6 కిలోమీటర్లు కాలినడకన గ్రామం నుండి పినకోట ఆసుపత్రికి తీసుకెళ్లారు. పురిటినొప్పులు తీరకుండానే ఆరుకిలోమీటర్లు దూరం నడిచి వెళ్లేందుకు బాలింత పడిన వేతన అంతాఇంతాకాదు. గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వారు పడుతున్నా అవస్థలకు ఇది మరో నిదర్శనం, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గిరిగ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పందిరిమామిడి వలసకు చెందిన చింతస్వామినాయుడు, వెంకట ప్రసాద్ తదితరులు వేడుకున్నారు

అర్హులందరికీ 'అన్నదాతా సుఖీభవ'

- స్మార్ట్ రేషన్ కార్డ్ల పంపిణీ వేగవంతం చేయాలి
- మ్యుటేషన్, రీ సర్వే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - పాడేరు : డి పట్టా, ఆర్ఒఎఫ్ఆర్, జిరాయితీ భూమి ఉన్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని మండలాల తహసిల్దార్, మండల సర్వే అధికారుల, గ్రామ రెవెన్యూ, సర్వే, పౌర సరఫరాల శాఖ అధికారులతో వారాంతపు రెవెన్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి సంబంధిత పత్రాలు అందజేయడంలో ఆలస్యం కాకూడదని అధికారులకు ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను ఎస్ఎల్ఎ గడువు దాటకుండా వెనువెంటనే పరిష్కరించాలని, దీనిపై తహశీల్దార్లు శ్రద్ధ చూపాలన్నారు. ఇల్లు స్థలాల లబ్ధిదారుల నిర్మాణంలో జాప్యంపైఆరా తీశారు. రీ సర్వే ప్రక్రియలో గ్రామం సరిహద్దుల లో ఉన్న సంబంధిత శాఖ భూములకు నోటీసులు ఇవ్వాలని తెలిపారు. అటవీ, రెవెన్యూ సమస్యలు ఉన్న గ్రామాలలో సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో టెక్నికల్ సమస్యలు ఉంటే కలెక్టరేట్ ఇడిఎంకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. స్మార్ట్ కార్స్ పంపిణీలో జాప్యంపై ఆరా తీసి, పంపిణీ త్వరితగతిన చేయాలని ఆదేశించారు. మైగ్రేషన్, గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుదారుల వివరాలు పక్కాగా తెలుసుకొని, కార్డు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రేషన్ డిపోలన్నీ ఆన్‌లైన్ చేయాలని పౌరసరఫరాల శాఖకు ఆదేశించారు. వృద్ధులకు ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందించాలని రేషన్ డిపో డీలర్స్‌కు ఆదేశించారు. తహశీల్దార్లు, విఆర్ఒలు రేషన్‌డిపోలను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, డిఆర్ఒకె. పద్మలత, రీ సర్వే ఎడి కె.దేవేంద్రుడు, జిల్లా పౌర సరఫరాల అధికారి వి మోహన్ పాల్గొన్నారు.

డ్రోన్ల సంచారంపై భీతిల్లుతున్న గిరిజనం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోరేం? : ఆదివాసీ గిరిజన సంఘం



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశకి-పాడేరు : అల్లూరి జిల్లాలో అరకువేలి, అనంతగిరి, హుకుంపేట మండలాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత భూర్జ, బస్కి, లోతేరు, ఇరగాయి, వేంగడ, పైనంపాడు, మజ్జివలస, వాలసి, పెదబిడ్డ, లుంగపర్తి టోకూరు పరిసర గ్రామాల్లో మూడునెలలుగా డ్రోన్లతో అలజడిపై తగిన ఆధారాలతో జిల్లా ఎస్పి, డిఎస్‌పిలకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన చర్యలు లేకపోవడం దారుణమనిఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు ధర్మన్నపడాల్ ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మండిపడ్డారు దీనిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అరకువేలి మండలం, బస్కి, లోతరు, ఇరగాయి అనంతగిరి మండలం వేంగడ, వాలసి, పెదబిడ్డ, లంగుపర్తి, పైనంపాడు, హుకుంపేట మండలం భూర్జ,పట్టాం పంచాయితీల పరిసర గ్రామాల్లో మూడునెలల నుండి రాత్రి పూట నిత్యం డ్రోన్లు ఎగురుతున్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పిలకు ఆధారాలతో పిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా, ఆదివాసులకు మభ్య పెట్టే విధంగా ప్రకటనలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు ఉటాయని జిల్లా ఎస్పి ప్రకటనలో ఆచరణలో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవయుగ కంపెనీలకు చెందిన వ్యక్తులు డ్రోన్లు ఎగిరిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులకు జలసమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సహకరించే చర్యలను జిల్లా అధికార యంత్రాంగం మానుకోవాలన్నారు. బాధ్యులపై ఎప్పుడు, ఎటువంటి చర్యలు తీసుకుంటారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఐదుగురు'ఆశ్రమ' విద్యార్థినుల పరారీ

- చాకచక్యంగా గుర్తించిన పోలీసులు

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని వంగసార గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల నుండి ఐదుగురుపదో తరగతి విద్యార్థినులు ఆదివారం రాత్రి పరారైన ఘటన కలకలం రేపింది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో స్నాక్స్ తీసుకున్న బాలికలు రాత్రి భోజన సమయానికి కనిపించలేదు. దీంతో ఉపాధ్యాయులు వారిని వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక పద్ధతుల ద్వారా పోలీసులు బాలికలను గుర్తించి సురక్షితంగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణ అనంతరం వారిని కౌన్సిలింగ్ కోసం మంగళవారం పాడేరు ఐటిడిఏ అధికారుల వద్దకు తరలించారు.

ఇటీవల పాడేరు ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యార్థినులు తరచుగా పరారవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్వాహకుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఆరోపణలున్నాయి. విద్యార్థినుల భద్రత పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, హాస్టల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన కృష్ణ, గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు.

ఎంపిటిసిల గైర్హాజరుతో మండల సభ వాయిదా

ప్రజాశక్తి-అనంతగిరి: స్థానిక ఎంపిపి నీలవేణిపై అవిశ్వాసం నేపథ్యంలో ఎంపిటిసిలు మూకుమ్మడిగా గైర్హాజరుతో మంగళవారం జరగాల్సిన స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపిడిఒ ప్రభాకరరావు మండల సర్వసభ్య సమావేశం నిర్వహణకు నోటీసులివ్వగా, మండలంలోని14 మంది ఎంపిటిసిల్లో ఒక్కరు కూడా సమావేశానికి హాజరు కాలేదన్నారు. దీంతో సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. అయితే ఎంపిటిసిలు గైర్హాజరైనప్పటికీ, హాజరైన సర్పంచులు అధికారులతో సాదారణ సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాను నష్టాలపై సర్పంచులు ప్రశ్నలకు అధికారులు వివరణనిచ్చారు. అనంతరం ఎంపిపి నీలవేణి సర్పంచులతో మాట్లాడుతూ, పంచాయతీ సమస్యలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎస్.సన్యాసిరావు. సింహాద్రి, రూతు, జె.సన్యాసిరావు. మొస్య.లతోపాటు తహశీల్దార్ వీరభద్రాచారి. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రమదానంతో మట్టి రోడ్డు ఏర్పాటు

- తారు రోడ్డు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



శ్రమదానంతో బాగుచేసిన రోడ్డులో మోకాళ్లపై కూర్చుని గిరిజనుల మొర

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం తమ్మింగుల పంచాయతి పరిధిలోని వెదురుపల్లి, చిట్టంగరువు గ్రామాల ప్రజలు శ్రమదానంతో మట్టి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఐదు కిలోమీటర్ల పొడవున ఉన్న ఏర్పాటు చేసిన ఈ మట్టి రహదారి స్థానంలో తారు రోడ్డుగా మంజూరు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. వెదురుపల్లి, చిట్టంగరువు గ్రామాలకు సరైన రహదారి లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మట్టి రహదారి కారణంగా టూ వీలర్ వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం జన్మన్ హౌసింగ్ పథకం కింద ఇళ్లను మంజూరు చేసినప్పటికీ, రహదారి లేక మెటీరియల్ రవాణా చేయడం కష్టంగా మారిందని, అందువల్ల అనేక ఇళ్ల పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారికి సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణనష్టం జరుగుతోందని పేర్కొన్నారు. శ్రమదానం ద్వారా గుంతలు పూడ్చి రహదారి పనులు చేపట్టారని, ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమేననిచ, ప్రభుత్వం వెంటనే ఐదు కిలోమీటర్ల తారు రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గేమ్మెల దావీదు, గ్రామస్తులు గేమ్మెల సురేష్ కుమార్, గేమ్మెల సత్తిబాబు, గేమ్మెల నాగేష్, గేమ్మెల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-రంపచోడవరం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు ప్రధాన జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాసంఘ కార్యాలయం వద్ద భవననిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు సురేష్ అధ్యక్షతన భవననిర్మాణ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సంక్షేమ బోర్డు, సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర కాలం అవుతున్నా సంక్షేమబోర్డు ఊసే ఎత్తకపోవడం దుర్మార్గమన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదని భవన నిర్మాణ కార్మికులు దాచుకున్న 3 వేల కోట్లు నిల్వ ఉందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అసెంబ్లీలో పేర్కొన్నారని గుర్తు చేశారు. వద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రంపచోడవరం కేంద్రంగా భవనిర్మాణ కార్మికుల అవసరాలకు లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం లోన్లు ఇవ్వాలని, ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మొట్ల వాణిశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రాంబాబు, శాంతిరాజు, భవనిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి రామరాజు, జిల్లా భవనిర్మాణ కార్మికుల జిల్లా కమిటీ సభ్యులు పెమ్మే శ్రీను, సిహెచ్ ఆదినారాయణ, విజయభాస్కర్, సిహెచ్ చిన్నారెడ్డి, యోహన్, సూరిబాబు, సిహెచ్ స్వామి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండలం కాకరపాడు గ్రామంలో వినాయకుని ఆలయం 516-ఈ హైవే నిర్మాణంలో తొలగించారు. దీంతో గ్రామస్తులు ఆ ఆలయానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ రాజన్నదొర కాకరపాడు వచ్చి స్థల పరిశీలన చేశారని కమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం తెలిపారు. 59-1 సర్వే నెంబర్‌లో 2 సెంట్ల భూమిని కేటాయించారన్నారు. దీంతో గ్రామస్తులు రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్‌కి ధన్యవాదాలు తెలిపారు.



రోడ్డు పక్కన తొలగించిన పిచ్చిమొక్కలు

రాజేంద్రపాలెంలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యూరు మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. రాజేంద్రపాలెం సచివాలయ ఆవరణలో కూడా తుప్పలు తొలగించారు. పంచాయతీ సెక్రటరీ మౌనిక, కమల సర్పంచ్ సింహాచలం ఆధ్వర్యంలో పనులు నిర్వహించారు.



రాజఒమ్మంగి: లాగరాయి పిహెచ్‌సి వద్ద డిఎంహెచ్ఒ సరిత

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు

- అడిషనల్ డిఎంహెచ్ఒ సరిత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్ఒ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని లాగరాయి, రాజఒమ్మంగి, జడ్డంగి పిహెచ్‌సీలను ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. మందుల స్టాక్ ఉంచిన రూమ్‌లు పరిశీలించారు. వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా పిహెచ్‌సిలలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం,ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఐఎల్ఆర్ వ్యాక్సినేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిల పరిధిలో ఎక్కడా మాతాశిశు మరణాలు జరగకూడదని హెచ్చరించారు. మందుల కొరత ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగల మండలం ఎల్లవరం పంచాయతీ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను రంపచోడవరం డివిజన్ అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ సరిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంలో హాస్పిటల్ సిబ్బంది మరియు ఫీల్డ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని, మాతశిశు సంరక్షణ సేవలను సమయానికి సక్రమంగా అందించాలనీ, ఎన్‌సీడి, సీడి ఆర్‌బిఎస్‌కే సర్వేలను పూర్తిచేయాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ దేవి ప్రియాంక, డాక్టర్ ఎస్తేరారాణి, సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఎంఎల్ఎచ్‌పీలు సమావేశానికి హాజరయ్యారు.



కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-సీలేరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ప్రిన్సిపల్ శంకరరావు విద్యార్థులకు సూచించారు. జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల చుట్టుపక్కల విద్యార్థులు, అధ్యాపకులు పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అధ్యాపకులు చెప్పిన పాఠాలను విద్యార్థులు చక్కగా నేర్చుకుని ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ ఆఫీసర్ కామర్స్ మిక్సర్ శ్రీనివాస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు ఆదేశించారు. మంగళవారం ఎం.మాకవరం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, హాజరు పట్టికను తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. సర్పంచ్ చింతల్లి రాజుబాబు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు



అడ్డతీగల: సంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి అధ్యక్షతన పోలీసులు మహిళలు భద్రత, గంజాయి వలన అనర్థాలు వంటి వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ గంజాయి వలన కలిగే, అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్‌నేరాలు మహిళలు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో పవనగిరి టెంపుల్ సమీపంలో అడ్డతీగల సిఐ నరసింహమూర్తి, అడ్డతీగల ఎస్సై వినోద్ మంగళవారం సంతకు వచ్చిన జనంతో గంజాయి రవాణా, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు గురించి కూడా అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి రవాణా చేసినా, రవాణా చేసే వారికి సహకరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రాజఒమ్మంగి: కోటి సంతకాల సేకరణ చేయిస్తున్న వైసిపి నేతలు

ముగిసిన వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ మంగళవారంతో ముగిసిందని సీలేరు ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ పాంగి దుర్గో వెల్లడించారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టామన్నారు. సీలేరు పంచాయతీ పరిధిలో దుర్గాదేవి అల్లూరి వీధి సిపిహెచ్ క్యాంపు శ్రీనివాసనగర్, పార్వతినగర్, చింతపల్లి క్యాంపు చంద్రుపల్లి లైకాన్ పుర్‌లలో వెయ్యికి పైగా సంతకాల సేకరణ చేసామన్నారు. కార్యక్రమంలో సీలేరు వైసిపి పట్టణ అధ్యక్షుడు పేలూరి సత్యనారాయణ (బుజ్జి), కార్యదర్శి శ్రీకాకుళం నూకరాజు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసిపి మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, వైసిపి జిల్లా నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఆధ్వర్యంలో జరిగింది.ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైసిపి నేతలు సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, వైసీపీ నేతలు ఎన్ కుశరాజు పాల్గొన్నారు.

పాఠశాలల అదనపు భవనాలకు నిధులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ జిటిడబ్ల్యు స్కూల్ డి.అగ్రహారం ఎంపిపి పాఠశాలకు అదనపు భవనాల నిర్మాణానికి ఒక్కొక్క స్కూల్‌కు రూ.14.65 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని దుప్పిలివాడ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమారాణి తెలిపింది. ఆమె స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ మనబడి, మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా అదనపు భవనాల నిర్మాణానికి 9 మంది సభ్యులతో కమిటీ ఎంపిక చేసామని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్లు,హెచ్ఎంలు, ఉపాధ్యాయులు భాగస్వామ్యంలో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డి.అగ్రహారం హెచ్ఎం భవాని, ఎం.నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9న మండల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని ములకనపల్లి పంచాయతీ లోని కుంజావారిగూడెంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం కుంజా కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మండల మహాసభకు ఆదివాసీ నిరుద్యోగ యువత ఆదివాసీ ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ చట్టాలు, ఆదివాసీ హక్కుల వాటి రక్షణ గురించి చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించడానికి ఈ మహాసభ జరుగుతుందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోయం. చినబాబు, జల్లి సత్యనారాయణ, కుంజ రాజయ్య పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో గ్రామ, వార్డు వాలంటీర్లు

కొనసాగుతున్న వాలంటీర్ల దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఐటిడిఎ గేటు ఎదుట చేస్తున్న గ్రామ వాలంటీర్ల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నేతలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా సిఎం చంద్రబాబు వాలంటీర్లను ఆదుకుంటామని చెప్పి అధికారం వచ్చిన తర్వాత విస్మరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమను రెన్యువల్ చేసి యథావిధిగా విధుల్లోకి కొనసాగించాలని, గౌరవ వేతనంగా రూ.10వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జికె వీధి, జి.మాడుగుల మండలాల వాలంటీర్లు దీక్షలో పాల్గొన్నారు.



ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపిటిసి, సర్పంచ్

బదిలీ ఉద్యోగులకు ఘనసత్కారం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని జర్జుల గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న ఉద్యోగులను మంగళవారం ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ కేశ్రం.నరసింగరావు, విఆర్ఓ చిట్టిపల్లి హరినాథ్ పడాల్, డిజిటల్ అసిస్టెంట్ బుజ్జిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ బుచ్చిరాజు, ఎఎన్ఎం వెన్నెల. దాలమ్మ, మహిళా పోలీసు ముఖీ సింహలక్ష్మిలను మంగళవారం స్థానిక సచివాలయ కేంద్రంలో సర్పంచ్, ఎంపిటిసిలు దుశ్శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డి.పోర్జమ్మ మాట్లాడుతూ బదిలీలో వెళ్తున్న వారంతా స్థానిక సచివాలయాల్లో అందించిన సేవలు మరువలేమన్నారు. జర్జుల ఎంపిటిసి వంతెల.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆదివాసి గిరిజన ప్రజలకు ప్రభుత్వపథకాలు అందజేయడంలో వీరంతా చిత్తశుద్ధితో పనిచేశారని, కొత్త చోట కూడా ఇదేవిధంగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పాంగి.పద్మారావు, ఉప సర్పంచ్ కోరా.సాధురు, వార్డ్ మెంబర్ కిల్లో.నారాయణ, లిపోయి, ధోన్,లక్ష్మీ పాంగి మోసేశ్వరావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- జి.మాడుగుల : మండలంలోని వంతల పంచాయతీ, చింతగొంది గ్రామంలో పదేళ్లుగా బాహాటంగానే నాటుబట్టీలు సాగించడమేకాకుండా, సారా మత్తులో ప్రజలతో వాగ్వాదం, గొడవలకు దిగుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు, ఎక్సైజ్ అధికారులను అనేకసార్లు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తడంతోపాటు నాటుసారా విచ్చలవిడి అమ్మకాలతో స్థానికులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బూర్జ పంచాయతీని అరకులోయలో విలీనం చేయాలి

గిరిజనుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి- హుకుంపేట : మండలాల విస్తరణలో భాగంగా బూర్జ గ్రామ పంచాయతీని ఉప్ప మండలంలో కాకుండా అరకులోయ మండలంలో విలీనం చేయాలని మంగళవారం బూర్జ పంచాయతీ కేంద్రంలో గిరిజనులు నిరసన చేపట్టారు. ఉప్ప మండలం వద్దు, అరకులోయ ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిపై ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ బూర్జ నుండి అరకులోయ కేవలం 15 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండగా, ఉప్ప మండల కేంద్రం దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రయాణానికి సమయం, వ్యయప్రయాసలు రెండూ పెరుగుతాయని, అందువల్ల అరకులోయ మండలంలో విలీనం చేయడం ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. మండల విస్తరణలో భాగంగా బూర్జ, బస్కి, వాలాసి, వేంగడా, పైనంపాడు, గత్తుమ్, పట్టం గ్రామాలు కలిసి కొత్త మండలంగా ఏర్పడితే మరింత సౌకర్యం కలుగుతుందని స్థానికులు సూచించారు.

బూర్జ పంచాయతీ గిరిజనులు మాట్లాడుతూ విజయనగరం రాజుల కాలంలోనూ, అనంతగిరి సంస్థాన కాలంలోనూ బూర్జ గ్రామం చారిత్రక ప్రాధాన్యం కలిగిందని, అరకులోయ మండలానికి రవాణా సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఉప్ప మండలానికి చేరుకోవడం కష్టమని, రవాణా సదుపాయం లేమి కారణంగా విద్యార్థులు, వద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బూర్జ పంచాయతీ అరకులోయ మండలంలో విలీనం చేయాలని స్థానిక ప్రజలు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో చిన్నబాబు, భాస్కర్ రావు, బోడన్న, చిన్నం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు

ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు సాగాలి

బాలికల పాఠశాల సందర్శనలో జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌పి అమిత్‌బర్ధర్

ప్రజాశక్తి హుకుంపేట : 'ఆడపిల్లలు ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగి ముందుకు సాగాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేంతవరకు నిబద్ధతతో కృషి చేయాలని జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే భవిష్యత్తు గ్యారంటీగా ఉంటుందని అన్నారు. మంగళవారం హుకుంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలను డిఎస్‌పి షేక్ సహబాజ్ మొహమ్మద్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి వి.పరిమళతో కలిసి సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి వారికి వాలీబాల్ కిట్లు, ఆట వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలను గుర్తించి, వాటిపై చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆడపిల్లలు విద్య, క్రీడ, సామాజిక రంగాల్లో రాణించి రోల్ మోడల్‌లుగా మారాలని ఆకాంక్షించారు.

బాల్యవివాహాలు, లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండి, విద్యపై దీప్తి సారించాలని, ఝాన్సీ లక్ష్మీబాయిలా ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థినులను ఉత్సాహపరిచారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నిరంతరం మోటివేషన్ ఇవ్వాలని ఆదేశించారు.కార్యక్రమంలో సిఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ, హెచ్‌ఎం మీనా కుమారి, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

7 నుంచి రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి పాడేరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అండర్ 14, 17, 19 విలువిద్య (ఆర్చరీ) పోటీలకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఆతిథ్యం ఇస్తోంది. ు పాడేరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మైదానాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 936 మంది బాలబాలికలు పాల్గొంటారనిన్నారు. క్రీడాకారులతో పాటు 52 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణలో భాగం పంచుకుంటారన్నారు. కార్యక్రమంలో డిఇఒ పి. బ్రహ్మాజీరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.సూరిబాబు, మాజీ కార్యదర్శి వి. కొండబాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్.భూపతి రాజు, పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

మంచినీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి- చింతపల్లి : చింతపల్లి పంచాయతీ పరిధి సాయినగర్ వీధిలో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి సరఫరా పథకాన్ని మంగళవారం ఎంపిపి కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయినగర్ ప్రజలు చాలాకాలంగా మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినా, ధర్నాలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య సమస్యను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రమ్మ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. సాయినగర్ వాసుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించినందుకు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దాసరి ధారలక్ష్మి, చిందాడ అప్పలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యులు నాజర్ వలీ, వార్డు సభ్యులు బండారి అప్పలనాయుడు, వైసిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కవడం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చిట్టబ్బాయి

సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సౌజన్యంతో ఐదు సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టి అబ్బాయి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం సంపాదించి కష్టపడి చదవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి మాట్లాడుతూ, మారుతున్న విజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త స్కిల్స్‌ను నేర్చుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వి.రమణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డికె జియ, ఐ.రవీంద్ర నాయక్, సర్టిఫికెట్ కోర్స్ కన్వీనర్ వరప్రసాద్, కో-కన్వీనర్ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- హుకుంపేట : మండలంలోని గత్తుం గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కిల్లో భగవాన్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత్తుం పాఠశాలలో సేవలందిస్తూ విద్యార్థుల మన్ననలు పొందారు. భగవాన్ మరణంతో విద్యావర్గాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ఎంఇఒ ఈశ్వరరావు, హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు గత్తుం పాఠశాలను సందర్శించి భగవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉపాధ్యాయుని కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందజేశారు.

పోలవరం షెడ్యూల్ ఏరియాలో సాగుచేస్తున్న వారిపై చర్య తీసుకోండి

ప్రజాశక్తి -కూనవరం : పోలవరం ఇరిగేషన్ కొరకు ప్రభుత్వం తీసుకున్న భూముల్లో షెడ్యూల్ ఏరియాలో సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలని తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు తమ్మయ్య, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు.గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ధర్మేంద్ర, ఎస్ఐ లతాశ్రీకి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 ఉన్న ఏరియాలో సర్వే నెంబర్ 237/గల భూమిలో 9 ఎకరాల భూమిలో గిరిజనేతరుడు అయినటువంటి తూముల వీర వెంకట రామారావు భూమిని సాగు చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి

ప్రజాశక్తి- విఆర్‌పురం: పోలవరం పరిహారానికి సంబంధించి ప్రతి ఇంటిని సర్వే చేయాలని బిసి కాలనీ గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని వడ్డిగూడెం పంచాయతీలోని బీసీ కాలనీ గ్రామస్తులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం పరిహారం కోసం విడుదల చేసిన ఇళ్ల నోటిఫికేషన్ జాబితాలో బీసీ కాలనీ గ్రామం రాకపోవడం తో ఆందోళన చెందుతున్నారు. కొన్ని కుటుంబాలకు సర్వే చేయకుండా కొన్ని ఇళ్లను మాత్రమే సర్వే చేస్తారని ప్రచారం జరుగుతోందని, దయచేసి అన్ని ఇళ్లకూ సర్వే నిర్వహించాలన్నారు. తామంతా ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని అవన్నీ మా గ్రామం పేరుమీదే ఉన్నాయని, ఇళ్లు మాత్రం రేఖపల్లి పంచాయతీలో ఉన్నాయని అధికారులు చెప్పడం న్యాయం కాదని ఒడ్డుగూడెం తరువాత ముంపునకు గురయ్యేది మా గ్రామ మేనని వారు వాపోయారు. ప్రతి ఇంటికి సర్వే చేసి వివరాలు నమోదు చేయాలన్నారు.



సాంస్కృతిక వేషధారణలో విద్యార్థినులు

రెండోరోజూ ఉత్సాహంగా కళాఉత్సవ్

ప్రజాశక్తి- మారేడుమిల్లి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ రెండోరోజు ఘనంగా నిర్వహించామని గురుకులాల జాయింట్ కార్యదర్శి వై.వి.ఎస్ .ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రెటరీలు మధుసూదన వర్మ, నెట్ కన్సల్టెంట్ ఎం జి. కిషోర్, ప్రిన్సిపాల్ శ్రీ శ్రీనివాస శర్మ తదితరులు హాజరయ్యారు.

మంచినీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కూటూరు గ్రామంలో జల జీవన్‌మిషన్ ద్వారా నిర్మించిన మంచినీటి సోలార్ పంపు పాడైన ఇబ్బంది పడుతున్నామని గ్రామంలో 30 కుటుంబాలకు మంచినీరు అందడం లేదని మంగళవారం పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతి పత్రం అందించారు. మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య మాట్లాడుతూ సోలార్ పంపు పాడైనదని ఆర్‌డబ్ల్యుఅధికారులకు సంవత్సరం క్రితం వినతిపత్రాలు ఇచ్చిన ఇంతవరకు సరి చేయలేదన్నారు. తక్షణమే మంచి నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూపరాజు అర్జమ్మ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతి ఇస్తున్న మహిళలు

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు



అడ్డతీగల: బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు, యుటిఎఫ్ నాయకులు



అరకురూరల్: విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎంఇఒ, హెచ్‌ఎం

అడ్డతీగల- ప్రజాశక్తి: స్థానిక మండల కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీలో చెకుముకి సైన్స్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షకు అడ్డతీగల మండలంలో 8 హైస్కూల్స్ నుండి విద్యార్థులు హాజరయ్యారు. గొంతువానిపాలెం విద్యార్థులు ప్రథమ స్థాయి, ప్రైవేట్ పాఠశాల నుండి హోషన్నా హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వీరు తదుపరి జరిగే జిల్లాస్థాయి పరీక్షల్లో పాల్గొంటారు. వీరిని ప్రోత్సహించడానికి యుటిఎఫ్ మండల శాఖ వారు మెమొంటోలు, మెడల్స్ అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ కుమార్ ,రంపచోడవరం డిడి రుక్మాండయ్య విచ్చేశారు. వారి చేతులమీదుగా విజేతలకు మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రమేష్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.అదేవిధంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాఘవులు, జిల్లా ఆడిటర్ మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ వద్ద చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిడి రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్య సాయిబాబా మెమొంటోస్ స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 గంగవరం టి. మల్లేశ్వరరావు, యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక అల్లూరి సీతారామరాజు 2 కమిటీ రంపచోడవరం మండల యూటిఎఫ్ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ రంపచోడవరం ప్రథమ స్థానం, లెనోరా పబ్లిక్ స్కూల్ ప్రైవేట్ పాఠశాల విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలురు బందపల్లి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల తతీయ స్థానంలో ఉంది.11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జ్ఞాపికలు అంబటి శ్రీనివాసరావు కుటుంబం పేరున జ్ఞాపికలను బహుకరించారు. విజేతలు నవంబర్ 23న జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాలన్నారు. డివిజన్ సబ్ కలెక్టర్ అంబేద్కర్ ఎంఇఒ శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డి.పైడిమల్లు, జి శ్రీను పర్యవేక్షణలో మంగళవారం చెకుముకి టెస్ట్ నిర్వహించారు. 11 ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు చొప్పున విన్నర్స్ పాల్గొనడం జరిగిందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు తీగల బొజ్జియ్య, యుటిఎఫ్ మండల అధ్యక్షులు పరిసిక సుబ్బారావు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె శ్రీను తెలిపారు. పరీక్షలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల నుండి విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొందగా, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయస్థానం జడ్డంగి ఉన్నత పాఠశాల తతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలకు ఆరుమిల్లి వెంకటసుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమార్తె ఆరుమిల్లి ఆదిలక్ష్మి బహుమతులు ఎంఇఒ కెవివి సత్యనారాయణదొర, ఎంఇఒ 2 సూరయ్యరెడ్డి, ఉపాధ్యాయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, యుటిఎఫ్ నేతలు కానేం శ్రీను, సిహెచ్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: జనవిజ్ఞాన వేదికఆధ్వర్యంలో అరకు లోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించారు.

ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ పోటీల్లో ప్రతిభలో కనబరిచిన విద్యార్థులకు ఎంఇఒ భారతి రత్నం, హెచ్‌ఎం టి మోహనరావు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయిపోటీలకు ఎంపిక చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ సుబన్ బోద్నాయక్. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ కె బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం: మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు



గంగవరం: బహుమతి ప్రదానం చేస్తున్న డిడి రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు



రాజవొమ్మంగి: విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఇఒ తదితరులు



వ్యవసాయ పద్ధతులపై వివరిస్తున్న ఎఒ గిరిబాబు

వంతాడపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-జీకేవీధి : మండలంలోని జర్రెల సచివాలయం వంతాడపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ప్రస్తుత సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తుఫాను తర్వాత వరి పంటలో తాలుగింజలు (పొల్లు గింజలు) అక్కడక్కడా కనిపిస్తుంది కావున ప్రాఫినిఫోస్ పిచికారీ చేయాలని అదేవిదంగా రాజ్మా పంటకు వేపనూనె పిచికారీ చేయాలన్నారు. సైకిల్ వీడర్లు రాయితీపై అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అశోక్, విష్ణుమూర్తి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండ

ప్రజాశక్తి- వి.ఆర్.పురం: కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మండల టిడిపి అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం చిన్నమట్టపల్లిలో కోట్ల బాలయ్య అధ్యక్షతన సొసైటీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టిడిపి ఏజెన్సీ గ్రామాల అభివద్ధికి కృషి చేస్తోందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు,మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజు తదితరులు పాల్గొన్నారు.



కర్రబల్లి పాఠశాల

శిథిలమైన బడులు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థలో చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలోఉండడంతో గిరి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. మండలంలో కొర్రాయి పంచాయతీ కర్రబల్లి, అరమ పంచాయతీ తుద్రుంగుడ ప్రాథమిక పాఠశాలల భవనాలు పూర్తిగా మరమ్మత్తుకు గురై ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏ క్షణాన ఏంజరుగుతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు ,వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మొంథా తుపాన్ వర్షాలతో మండలంలోని వంతార్డ పాఠశాల కూలిపోయిన విషయం తెలిసిందే .తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థలో చేరిన భవనాలను పూర్తిగా కూల్చివేసి కొత్త భవనాలను నిర్మించాలని గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తుద్రుంగుడ పాఠశాల